క్లుప్తంగా

అంతిమ సంస్కారానికి ఆర్థిక సాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కోటగల్లి ప్రాంతంలో కిరాయి ఇంట్లో నివాసం ఉండే లస్కరి శ్రీనివాస్(54) ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో భార్య అనసూయ అంత్యక్రియలకు సహాయం చేయాలని శ్రీలక్ష్మీ చేయూత సేవా సమితిని కోరగా వెంటనే రూ.10,100/- శనివారం శ్రీనివాస్ కుమార్తె రవళికి అందజేశారు. సేవలో ప్రధాన కార్యదర్శి అల్వాల లక్ష్మణ్, కార్యవర్గ సభ్యుడు తాటి శ్యామ్ కుమార్ పాల్గొన్నారు

ట్రాఫిక్ పోలీసులకు మందులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీసులకు వడదెబ్బ తగలకుండా హోమియో మందులను డీసీపీ కోటేశ్వర్ రావు అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ కార్యాలయంలో జేమ్స్ రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో హోమియో మందులను అందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్ సీఐ వెంకటనారయణ, తదితరలుఉ పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంతోష్ కుమార్

సుభాష్‌నగర్: బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్‌కు చెందిన సంతోష్ కుమార్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సేవేళ్ల మహేందర్ శనివారం నియమించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ రాష్ట్ర అగ్రనేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధికంగా ఎంపీ సీట్లు సాధించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్‌లో రెండోసారి కాషాయ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఇందల్వాయి: ఎల్లారెడ్డిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 230 పెన్నులు, 130 స్కేల్స్, పెన్సిల్లు, బిస్కెట్ ప్యాకెట్లు తదితర సామగ్రి శనివారం అందజేశారు. గతంలో కూడా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పరీక్ష సామగ్రి అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. టి.రామ్మోహన్ రావు, శ్రీనివాస్, బాలశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సమాచారంపై అవగాహన కలిగి ఉండాలి



నిజామాబాద్‌రూరల్: ప్రజలు న్యాయ సమాచారంపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది అంజలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేశాపూర్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా వాలంటీర్లు, గ్రామస్తులకు న్యాయ సలహాలు, విధివిధానాలను న్యాయవాది అంజలి సమగ్రంగా వివరించారు.

'నిబంధనలు పక్కాగా అమలు చేయండి'

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు పక్కాగా నిబంధనలు అమలు చేయాలని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరందు సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా 501 మంది టీచర్లకు ఎన్నికల విధులు, నియమ నిబంధనలపై శిక్షణ ఇచ్చారు. ముందుగా ఎన్నికల పోలింగ్ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. ఎన్నికల్లో పక్కాగా నిబంధనలు, సమయ పాలన పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసిడింట్ అధికారులతో పాటు ఉండే సిబ్బందికి కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోండి

నిజామాబాద్‌అర్బన్: అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలల, కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ డిమాండ్ చేశారు. శనివారం ఏబీవీపీ ఇందూర్ జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు వేసవి సెలవుల్లో కూడా అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ఇప్పటి నుంచే మొదటి టర్మ్ ఫీజు కట్టాలని ఇబ్బందులు పెడుతున్నారని, డీఐఈవో, డీఈవో వెంటనే స్పందించాలని కోరారు.

ఎన్నికల విధులపై శిక్షణ

సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా అదర్ పోలింగ్ ఆఫీసర్లకు ఎన్నికల విధులకు సంబంధించి ఒక రోజు శిక్షణను శనివారం నిర్వహించారు. శిక్షకుడు వంశీకృష్ణ ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రవీందర్‌రావు, ఏఆర్ఐ నాగన్న, ఎమ్మార్సై గంగరాజం పాల్గొన్నారు.

రంజాన్ సందడి



నెహ్రూపార్క్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలు

సిటీ సండే



నిజామాబాద్ నగరంలో రంజాన్ సందడి మరింత జోరందుకుంది. పండుగకు నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండడంతో పాటు శనివారం 'జగ్‌నేకీ రాత్' కావడంతో భారీ కోలాహలం నెలకొంది. నెహ్రూ పార్క్, అహ్మదీ బజార్ రోడ్డులో వందల మంది షాపింగ్ చేస్తున్నారు. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా దుకాణాలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా దుస్తులు, గాజులు, పింగాణీ వస్తువులు, టోపీలు, అత్తర్లు, పాదరక్షలు, రోల్డ్ గోల్డ్ వస్తువులను ఉత్సాహంగా కొనుగోలు చేస్తు న్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత నిజామాబాద్‌లోనే రంజాన్ పర్వదిన ఉత్సాహం ఎక్కువగా కనిపిస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలైన నిర్మల్, భైంసా, కామారెడ్డి, బాన్సువాడ నుంచి నిజామాబాద్ మార్కెట్‌కు ఎక్కువ మంది వస్తుంటారు. దీంతో నిజామాబాద్‌లో రంజాన్ వెలుగులు విరజిమ్ముతున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



అత్తర్లు అమ్ముతున్న దుకాణదారుడు





కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వస్త్ర, గాజుల దుకాణాలు

వ్యాపార లావాదేవీలపై మినహాయింపు ఇవ్వాలి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా డబ్బుల తనిఖీ విషయంలో వ్యాపారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్‌కు నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఖాతాలు, రసీదులు ఉన్నా పోలీసులు బ్యాంకుల బయటే ఉంటూ డబ్బును సీజ్ చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెట్రోలు బంక్‌లు, రైస్‌మిల్లులు, రైతులు, మాల్స్ తదితర సొమ్మును బ్యాంక్‌లకు తరలించడంలో ఇబ్బంది కలుగుతుందని అన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కమల్ ఇనాని తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: తాను కష్టపడే వ్యక్తినని, ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ ఐదేళ్ల కాలంలో ఒక్క రుపాయి కూడా తేలేకపోయాడని విమర్శించారు. పసుపు బోర్డు మీద గెలిచి ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ఇప్పుడు ఓడిపోతానని మోదీని చూసి నన్ను గెలిపించాలని కోరుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంత అభివృద్ధి చేసినా ప్రజలు మార్పు కోరుకున్నారు కాబట్టి బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మొండి చేయి చూపిస్తున్నదని పేర్కొన్నారు. హామీలను అమలు చేయకుండా మేడిగడ్డ, ఫోన్ ట్యాపింగ్‌ల పేరిట టైంపాస్ చేస్తున్నారని విమర్శించారు. ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జెడ్పీటీసీ జగన్, వైస్ ఎంపీపీ రాజన్న, నాయకులు గోపి, గంగారెడ్డి, సురేందర్, ఫిలిప్, రాజేందర్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి

నిజామాబాద్‌నాగారం: వరికి క్వింటాల్ కు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల కోసం పోరుబాట పట్టారు. బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందన్నారు. ఎకరానికి రూ.15వేల రైతుబంధు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 117 రోజులు దాటినా వాటి ఊసెత్తడం లేదని పేర్కొన్నారు. వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సుభాష్‌నగర్: జిల్లాలోని ఆశావర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో ప్రశాంత్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశాలకు మార్చి నెల పారితోషికం ఇంకా రాలేదని, ప్రతినెల 2న రావాల్సిన పారితోషికాలు 5వ తేదీ గడిచినా రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించే పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల విధి నిర్వహణలో మృతిచెందిన అబ్బమ్మ, సరోజ కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు సుకన్య, లలిత, సాహేరా బేగం, అతియా బేగం, కౌసర్ బేగం, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

మహిళా అధికారిని వేధిస్తే ఊరుకునేది లేదు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో సెక్టోరియల్ అధికారిగా, జీసీడీవోగా, ఏఎంవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న సింగం వనితపై కొందరు వేధింపులకు పాల్పడుతున్నారని, అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆదివాసీ నాయకపోడు ఉద్యోగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ అన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్‌ను కలిసి సింగం వనితను మానసికంగా వేధిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అధికారిణిని మానసిక వేధింపులకు గురి చేయడం సమంజసంగా లేదన్నారు. ఇదివరకే కొందరు కావాలని ఫిర్యాదు చేస్తే విచారణ చేసి ఉన్నతాధికారులు క్లీన్‌చిట్ ఇచ్చారని వారు పేర్కొన్నారు. రామచందర్, రాజు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు

మోపాల్: మండలంలోని 21 గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి క్లస్టర్ అధికారులతో తాగునీటి సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. 21 జీపీలను నాలుగు క్లస్టర్లుగా విభజించామని తెలిపారు. ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో లింగం నాయక్, తహసీల్దార్ రామ లింగేశ్వర్, ఏవో రవీందర్ ఉన్నారు.

ధర్పల్లి: వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మద్దుల్‌తండా, వాడి గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా బోరుబావులు, నీటి ట్యాంకులను పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ నీటిని వృథా చేయకూడదని గ్రామస్తులకు సూచించారు. ఎంపీడీవో బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయంలో పూజలు

నిజామాబాద్ సిటీ: వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ హనుమాన్ మందిరంలో శనివారం జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాలు పూజలు చేశారు. ఆలయంలో 45 రోజుల పాటు హనుమాన్ మాలధారణ భక్తులకు నిత్యం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతోంది. శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్‌కుమార్ హనుమాన్ మాలధార భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. బీజేపీ కార్పొరేటర్ స్రవంతి, భక్తులు పాల్గొన్నారు.

నగరంలో కోటి తలంబ్రాల దీక్ష

నిజామాబాద్ సిటీ: గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ కోటగల్లి హనుమాన్ దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా నుంచి 200మంది భక్తులు పాల్గొని గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలు తయారుచేసి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ భద్రాచలంలో కల్యాణానికి వాడే తలంబ్రాలను మొదటిసారిగా ఇక్కడ తయారు చేసే అవకాశం రావటంపై ఆనందం వ్యక్తం చేశారు.

గుండారం పాఠశాలలో ఉగాది బాలకవి సమ్మేళనం

నిజామాబాద్ రూరల్: ఉగాదిని పురస్కరించుకొని ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో గుండారం ఉన్నత పాఠశాలలో శనివారం 'బాలకవి సమ్మేళనం' ఘనంగా జరిగింది. మామిడి తోరణాలు, ఉగాది పచ్చళ్ల మధ్య తెలుగు పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా ముస్తాబైన 25 మంది విద్యార్థినులు కవి సమ్మేళనంలో పాల్గొని తమ ప్రతిభను చూపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇందూరు బాలసాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు డా.కాసర్ల నరేశ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్ మాట్లాడుతూ.., విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేలా బాలకవి సమ్మేళనాన్ని తమ పాఠశాలలో నిర్వహించిన జిల్లా బాలసాహిత్య వేదికకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మోపాల్: మండల కేంద్రంలో కెంపు అశోక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై గంగాధర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

రాజ్యాంగాన్ని మార్చే వారికి బుద్ధి చెప్పాలి

జక్రాన్‌పల్లి: రాజ్యాంగాన్ని మార్చే వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర శనివారం జక్రాన్‌పల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. కొందరు మనువాదులు రాజ్యాంగం స్థానంలో మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యాత్రకు స్వాగతం

నిజామాబాద్‌నాగారం: జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర శనివారం నిజామాబాద్ చేరుకున్న సందర్భంగా యాత్ర బృందానికి పులాంగ్ చౌరస్తా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రక్షణ యాత్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ వారసులమైన మనమంతా ఏకమై రాజ్యాంగాన్ని రక్షించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యాంగ రక్షణ యాత్ర కామారెడ్డికి బయలుదేరి వెళ్లింది.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బోర్గాం(పి)లో జెండా ఎగురవేస్తున్న బీజేపీ నేతలు



అమృతాపూర్‌లో కార్యకర్తలతో కులాచారి దినేష్

మోపాల్/డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి : రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జెండాలను పార్టీ కార్యాలయాల్లో కార్యకర్తలతో కలిసి నాయకులు ఎగురవేశారు. డిచ్‌పల్లి మండలం అమృతాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్, పార్టీ జెండా ఎగురవేసి అనంతరం టిఫిన్ బైఠక్ నిర్వహించారు. ఎందరో మహనీయుల జీవితాల త్యాగం ఫలితంగా ప్రస్తుతం బీజేపీ రాజకీయంగా ఎదురు లేని శక్తిగా ఎదిగిందన్నారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. నగరంలోని 5వ డివిజన్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడ సందగిరి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అన్నివర్గాల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో గెలిచేది బీజేపీయే

సుభాష్‌నగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇందూరు గడ్డపై మరోసారి కాషాయ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై పని చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 34వ డివిజన్ మిర్చికంపౌండ్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అలాగే టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. బీజేపీ రాజకీయంగా ఎదురులేని శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. 2 సీట్లతో మొదలై.. 303 సీట్లు సాధించిందని గుర్తుచేశారు. సామాన్య కుటుంబంలో పుట్టి చాయ్ అమ్ముకున్న వ్యక్తిని దేశ ప్రధానిగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రతిబూత్‌లో కార్యకర్త సైనికుల్లా పని చేసి 300 ఓట్లు ఆధిక్యం వచ్చేలా చూడాలన్నారు.



టిఫిన్ బైఠక్‌లో భాగంగా తింటున్న ఎమ్మెల్యే

సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన

ఇందల్వాయి: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో ఖాతాదారులకు సీపీ కల్మేష్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై పోలీసు సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం డబ్బులు వేస్తామని ఓటీపీ చెప్పాలని సైబర్ నేరగాళ్లు ఫేక్ ఫోన్ కాల్స్ చేసే అవకాశం ఉందని, అలాంటి అపరిచిత ఫోన్‌కాల్స్‌కి స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఏటీఎమ్ వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దన్నారు. వాట్సప్‌లో, మెసేజ్ రూపంలో వచ్చే అనవసరపు లింకులను క్లిక్ చేయవద్దని అన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నెంబరుకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది నవీన్, ప్రకాష్ నాయక్, రఘు, కిషన్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నూతన చట్టాలపై పోలీసులకు..

ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర ప్రాసిక్యూటర్ జి.వైజయంతి, ఉమ్మడి జిల్లాల ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు నూతన చట్టాలపై పోలీసులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్‌గౌడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక సురక్షా సంహిత-2023, భారతీయ సాక్ష అధినియం-2023లపై పోలీసులకు వివరించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, బంటు వసంత్, రాజారెడ్డి, నిజామాబాద్ డివిజన్‌కు చెందిన పోలీసు అధికారులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పై చర్యలు తీసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): నిషేధిత ఫార్మా డ్రగ్స్ తయారు చేస్తూ పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లిన తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ పెద్దోళ్ల శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకుని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీనునాయక్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఒక అధ్యాపకుడు తానే నిషేధిత డ్రగ్స్ తయారు చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం తెలంగాణ యూనివర్సిటీకి మాయని మచ్చ అని పేర్కొన్నారు. విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఉచిత దంత వైద్యశిబిరం

నిజామాబాద్‌రూరల్: నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ముబారక్ నగర్‌లో శనివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యుడు బలరాం నాయక్ హాజరై ఉచితంగా చికిత్స చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి కె.రవీంద్రరావు, వాలంటీర్లు, కార్పొరేటర్ నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,200	వెండి (కిలో)	83,500
22 క్యారెట్స్	66,600		– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	50	80			– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 10.25, 1.30, 4.35, 7.40, 10.45
స్క్రీన్-2	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.40, 10.30, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) 7.45
స్క్రీన్-3	భరత నాట్యం (తెలుగు) - 1.40, టిల్లు స్క్వేర్ (తెలుగు) - 7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 11.45, 3.10, 6.35, 10.00
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 11.20, 2.00, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 4.40, 7.20, 10.00
స్క్రీన్-3	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.30, 1.30, 7.40, 10.40, భరత నాట్యం (తెలుగు) - 4.55
స్క్రీన్ -4	క్రూ (తెలుగు) - 10.30, 1.20, 7.35, ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 4.10, భరత నాట్యం (తెలుగు) - 10.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	భరత నాట్యం (తెలుగు)
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)